# సులక్షణ

— పి.వి.యస్. అచ్యుతవల్లి

శివరాం సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే రోజూలానే అడిగింది సత్యవతి

"ఆమెను కనుక్కున్నారా?" అని. శివరాం తల అడ్డంగా విదిలించేడు లేదన్నట్లు. ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దది ఆడపిల్ల. బేబి. ఏడవ తరగతి మూడేళ్ళనించి దాటటం లేదు. తర్వాత పిల్లవాడు నందూ. వాడుకూడా ఏడవ తరగతిలోకి వచ్చేడు. తర్వాత పిల్లవాడు బుజ్జి. చేతిపిల్లవాడు. రెండో మూడో చదువుతున్నాడు. ఆ రోడ్డు చివరగానున్న పెంకుటింటిలోనికి ఒక పంతులమ్మ అద్దెకు వచ్చింది. నాలుగయిదు రోజుల్లోనే ఆ వాడకట్టు పిల్లలు చాలామంది ఆమె వద్దకు ప్రయివేట్ చెప్పించుకునేందుకు చేరిపోయ్యారు. ఇరుగూ పొరుగూ వాళ్ళు ఆవిడ చాలా బాగా చెప్పుతూందనే సర్టిఫికేట్ కూడా ఇచ్చారు. సత్యవతికి అరికాళ్ళల్లో దుమ్ము లేచిపోవటం మొదలు పెట్టింది. ఎంతో బాగా చదువుకునే పిల్లలకు కూడా ప్రయివేట్ పెట్టించారు. తన పిల్లలు శుద్ధ మొద్దులు. అందులో నందూ వున్నాడంటే అయిదూ నాలుగూ ఎంతంటే ఎనిమిదంటాడు తడుముకోకుండా. బేబీ అయితే ఏదో ఊసుపోని చదువు అనుకుంటుంది. మగపిల్లవాడికి కూడా చదువు అబ్బకపోతే ఎలాగు? ఇరుగు పొరుగూ కొత్త పంతులమ్మ సమర్థత పొగుడుతున్నకొద్దీ సత్యవతికి ఆరాటం ఆగటం లేదు. శివరాం ఆ దారినే వస్తూ పోతూ వుంటాడు. కాస్త ఒక్కక్షణం ఆగి, ఆమె పరిచయం సంపాదించుకుని "మా పిల్లలకి కూడా ట్యూషన్ చెప్పండి" అని ఖరారు చేయించటానికి ఇంత ప్రతిమిలాడించుకుంటున్నదేమిటి! అనుకుని విసుక్కుంది.

"ఏమిటండీ! వారం రోజులనుంచి చెబుతున్నాను, పంతులమ్మకు చెప్పి కుదిర్చారా అని! ఎందుకు అలా ఆలస్యం చేస్తారు? అప్పుడే సెప్టెంబరు చివరి వారం వచ్చేసింది" అంది.

"నువ్వెళ్ళి మాట్లాడకూడదూ! నన్ను చంపకపోతే?" అన్నాడు.

"నయం. మీరు వెళ్ళితే బాగుంటుంది. కాని నేను వెళ్ళి ట్యూషన్ ఫీజు ఎంత పుచ్చుకుంటావు అని అడగనా? మొహమాటంగా వుండదూ?"

"మొహమాటం దేనికి? ఆవిడ చేస్తున్న వృత్తి అదేగా? టైలర్ వద్దకు వెళ్ళి జాకెట్‌కు ఎంత తీసుకుంటావు అని అడగవా? అలాగే ఇదీనూ."

"అదీ ఇదీ ఒకటేనా? ఈమె మర్యాదస్తురాలుగా వుంది. చటుక్కున మీరు ప్రయివేట్ చెప్పటానికి ఎంత పుచ్చుకుంటారని తేలిగ్గా ఎలా అడిగేస్తాం?"

"టయిలరింగ్ చేసుకునేవాళ్ళు మర్యాదస్తులు కారా?"

"ఏమిటో మరీ ఒక్కొక్క ప్రొఫెషన్ ఒకొక్కలా స్ఫురిస్తుంది. టయిలర్స్ యింతకంటె ఎక్కువే సంపాదించవచ్చును. కాని గబుక్కున జాకెట్టు కెంత, లంగా కెంత






అని రేటు అడిగేయటానికి వీలుగా వుంటుంది. టీచింగ్ ప్రొఫెషన్ అలా కాదు. గమ్మున మీరు ఇంతకయితే మా పిల్లలకు పాఠం చెప్పరా అని అడిగేయ బుద్ధి పుట్టదు. ఎంచేతనో? చదువుకుని స్వతంత్రంగా బ్రతుకుతున్న వాళ్ళని లోకువగా మాట్లాడబుద్ధవదు నాకు!" అంది సత్యవతి. శివరాం వింతగా చూసేడు ఆమె వెంపు.

శివరాం పాతిక ముప్ఫయ్ సంబంధాలు వెతికి వెతికి చివరికి సత్యవతిని భార్యగా చేసుకున్నాడు. సంసారపక్షంగా వుండాలి. ఆడవాళ్ళు వంటయింటి గడప దాటకూడదు అని శివరాం అభిప్రాయం. శివరాం ఆఫీసులో లేడీ క్లర్కులు వున్నారు. వనజ, కామాక్షి. వనజ బి. ఏ. ప్యాసయింది. ఇంచుమించు శివరాంతో సమానంగా జీతం వస్తుంది ఆమెకి. కామాక్షి టైపిస్టు. ఏమాత్రం చనువుగా మాట్లాడినా సంసారాన్ని చదవట్టించుకున్నట్లే అంటాడు చలం. వనజ చాలా రిజర్వ్డుగా వుంటుంది. ఆఫీసరుకి దూరపు బంధువట. అందుకని అప్పుడప్పుడు అతని కారులో వస్తూ వుంటుంది. సత్యవతికి పెళ్ళి అయిన కొత్తలో శివరాం వాలకం అదో మూదిరిగా అన్పించేది. పండుగలకు, పబ్బాలకు తనని వెంటపెట్టుకుని తిరగకుండా అతనంతట అతనే బజారుకుపోయి చీరలు జాకెట్లు తెచ్చేవాడు. తెచ్చిన చీరలు తనకు నచ్చకపోయినా కట్టుకోవలసిందే.

"ఇంత పెద్ద పెద్ద పూల చీరలు నాకు బాగా వుండవు. నేను పొట్టిదాన్ని కదా! అయినా మీరు బజారుకు వెళ్ళేటప్పుడు నన్ను కూడా పిలుచుకుపోకూడదూ! సన్నని ప్రింట్స్ నాకిష్టం. బాగుంటాయి కూడాను" అంది. బేబీ పుట్టిన రెండేళ్ళకి కొంచెం చనువు వచ్చింది ఆమెకి.

"బజారుకు నువ్వెందుకు రావటం! ఈసారి సన్నని పూలవే తెస్తానులే" అన్నాడు శివరాం.

"అంతా బజారుకి వెళుతున్నారు. అసలు ఇంట్లో సరుకులు కూడా ఎవళ్ళంతట వాళ్ళే తెచ్చుకుంటున్నారు. ఎదురింటి వాణి లేదూ! ఆమె కూరగాయల మార్కెట్టుకు వెళుతూ నన్ను రమ్మంది. మీతో చెప్పలేదని అన్నాను. చెప్పేదేమిటిలెద్దూ అంది. మీరు కోపపడతారని భయమేసి, తల నొప్పి అని అబద్ధమాడాను" అంది సత్యవతి.

"అబద్ధమాడవలసిన అవసరం ఏమీ లేదు. మావారికి చీటికి మాటికి ఆడవాళ్ళు రోడ్ల వెంట తిరగటం ఇష్టం వుండదు అని చెప్పేయి. ఇంక నిన్ను ఇక్కడకు రమ్మని అక్కడకు రమ్మని పీక్కుతినటం మానుతారు" అన్నాడు శివరాం ఖండితంగా.

చామన చాయలో నాలుగడుగులు మించి వుండదు సత్యవతి. కోల ముఖం, వంకులు వంకులు వున్న సన్నని జడ. శివరాం పచ్చగా పొడుగ్గా వుంటాడు. అతనిదీ కోల ముఖమే. వంకుల జుత్తు. చక్కని డ్రెస్సులో నీటుగా వుంటాడు అతను. చూడగానే అంత అందగత్తెలా కన్పించదు సత్యవతి. చూడగాచూడగా పల్చని చెక్కిళ్ళతో తళతళ్లాడే కళ్ళతో పొట్టిగా ఎత్తుగా వున్న ముక్కుతో లేత గులాబీరంగు పెదాలతో మృదువయిన మనిషి అని మటుకు అన్పించుతుంది. నందూ పుట్టినాక కాబోలు అప్పుడప్పుడు సిన్మాలకు తీసుకు వెళ్ళడం ప్రారంభించాడు. బుజ్జి పుట్టినాక సత్యవతికి కొంచెం నోరు వచ్చింది. ధైర్యంచేసి ఎదురింటి వాణితో రెండు మూడుసార్లు బజారుకు వెళ్ళింది. శివరాం ఏదన్నా అంటే ఎదురు జవాబులు చెప్పటం మొదలు పెట్టింది. ముగురు పిల్లల తల్లిని ఏమీ అనలేక తానే తగ్గిపోతున్నాడు శివరాం. నందూకు కొత్త పంతులమ్మ వద్దకు ఎప్పుడు వెళ్ళి చదువుకుందామా అని తహతహగా వుంది. అంచేత నెమ్మదిగా తండ్రి వద్దకు జేరేడు.

"నాన్నా! నాన్నా! పోనీ ఆవిడ్ని ఇక్కడికి పిలుచుకుని రానా?" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు శివరాం.

"మీరు ఎంతకీ వాళ్ళింటికి వెళ్ళడం లేదు. అప్పుడే మన వీధి పిల్లలకు అయిదారు చాప్టర్స్ చెప్పేశారు ఆవిడ. నేను స్కూల్లో

కూడా చాలా వెనకబడి వున్నాను" అన్నాడు నందూ దీనంగా.

"మీ క్లాసు టీచర్ మీకు అర్థమయ్యేలా చెప్పరా?"

"ఆయన ఏం చెప్పినా మాకు అర్థంకాదు. మా క్లాసు పిల్లలందరూ ప్రయివేట్లు పెట్టించు కున్నారు."

"ప్రయివేట్గా చదువుకోవాలంటే ఇంక స్కూళ్ళకు వెళ్ళి ప్రయోజనం ఏమిటి? లెక్కల మాష్టారు ఒక్కరేనా, మిగిలిన సబ్జెక్టులవాళ్ళు కూడా అంతేనా?"

"అందరూ అంతే నాన్నా! వాళ్ళేమి చెబుతున్నారో మాకు అర్థం అవటం లేదు. ఇంటి దగ్గర పెద్దవాళ్ళు ఎవరయిన చెబితే తెలియని పాఠాలు మాకు తెలుస్తాయి. చెప్పేవాళ్ళు లేక పోతే ట్యూషను పెట్టుకుంటున్నారు" శివరాం ఎప్పుడో ఇరవయి నాలుగేళ్ళ క్రితం చదువుతున్నాడు. ఆ రోజుల్లో మాస్టరు చెప్పే పాఠాలు బాగానే అర్థం అయ్యేవి. ఇంకా యస్సెల్సీ పరీక్షల ముందు డౌట్స్ ఏమన్నా వుంటే ఇంటికి రమ్మనమనేవారు ఎంతో శ్రద్ధగా. తన క్లాసులో ప్రతి విద్యార్థీ ప్యాసు కావాలన్న తపన ఆ రోజుల్లో వుపాధ్యాయులకు వుండేది. ఇప్పుడు హైస్కూల్ నించి కాలేజీ చదువు వరకూ అంతా ట్యూషన్ మీదే చదువుకోవలసి వస్తుంది. అటు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, ఇటు ట్యూషన్లు వీటితో నలుగురు పిల్లలు చదువుకోవలసినవారు వుంటే ఆ ఇల్లు ఇంక దివాలా పరిస్థితిలో వుంటుంది.

"నా మాట వినండి. పాతిక రూపాయలు పోతే పోయినాయి. ఆ ఖర్చు ఇంకో దానిలో తగ్గించుకోవచ్చును. ఆవిడ వద్ద ట్యూషన్కి పెట్టించండి. వీడివల్లేనా బేబీ కూడా నాలుగు అక్షరమ్ముక్కలు వంట పట్టించుకుంటుంది" అంది బెల్లింపుగా.

"సర్లే! రేపు మాట్లాడతాను. ఇద్దరికీ పాతిక రూపాయలకు చెప్పరేమో" అన్నాడు.

"ఎందుకు చెప్పరూ! ఎదురింటి వారింట్లో ముగ్గురు పిల్లలకూ ముప్ఫయ్ రూపాయలకే చెప్పించుతున్నారు. ఇరవయికి అడిగి చూడండి" అంది.

"ఎదురింట్లో రామూ తమ్ముడు మూడో క్లాసు చదువుతున్నాడు. అందుకని తక్కువ జీతం పుచ్చుకుంటున్నారు వాళ్ళవద్ద" అంది బేబి.


"సర్లే. రేపు వెళ్ళుతాను. అయినా ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకోవాలి శ్రద్ధగా. ఇంటికి రాగానే ఏం మింగుదామా, ఎక్కడ గెంతులు వేద్దామా అనే తప్ప చదువుకుందుకు ముందుకు రాదు బుద్ధి" అన్నాడు విసుగ్గా. పిల్లలు మూతి ముడుచుకు కూర్చున్నారు.

"వాళ్ళు చెప్పందే వీళ్ళేం చదువుతారు? వుత్తికి వుత్తినే రాముడు దేవుడు అంటూ పదిసార్లు వల్లెవేస్తే సరిపోతుందా? రాముడు దేవుడు ఎందుకయినాడో, దైవత్వం పొందటానికి ఎన్ని మంచి పనులు చేయాలో? అసలు మంచి అంటే, చెడ్డ అంటే ఏమిటో ఇన్ని వివరణలు ఆ పసి మనస్సులకు హత్తుకు పోయేలా చెప్పాలి. అంత ఓపిక నేటి ఉపాధ్యాయుల కున్నదా? రాముడు దేవుడు. అప్ప చెప్పండిరా అంటారు. అప్పచెబుతుంటారు. దేవుడంటే ఎవరు? రాముడు. రాముడు ఎటువంటివాడు? దేవుడులాంటివాడు. అంతే తప్ప దేవుడు అనేదానికి ఎటువంటి విలువ వుందో వాళ్ళకు తెలియదు" అంది సత్యవతి.

"ఇలా పురాణ ప్రసంగాలు చేస్తూ పోతూ వుంటే ఈ పిల్లలకు ఇంక మామూలు చదువు ఎప్పుడు చెబుతారు? జీవితంలో ఎదుగుతున్న కొద్దీ మనుష్యులు వాళ్ళంతట వాళ్ళే నేర్చుకుంటారు" అన్నాడు శివరాం.

ఈమధ్య సత్యవతిని గమనిస్తూంటే శివరాం ఆశ్చర్యపోతున్నాడు మనస్సులోనే. తాను పెళ్ళి చూపులకు వెళ్ళిన రోజు గుర్తుకు వచ్చింది శివరాంకు. సత్యవతి పుట్టినిల్లు చాల్లా పల్లెటూరు. సత్యవతి మేనమామ ఇంటిలో నుండి ఫిఫ్తుఫారం చదువుకుంది. శివరాంకు సత్యవతి చాలా నచ్చింది. సత్యవతి ముఖం చాలా ప్రశాంతంగా వుంది. పెద్దలు చెప్పినట్లు వినే






ఒద్దిక సత్యవతిలో కనిపించింది. మారు మాట చెప్పకుండా ఒప్పుకున్నాడు. ఎంతో భయస్తురాలు అనుకున్నాడు. అలాంటిది ఇప్పుడు ఎంతో చలాకీతనం వచ్చింది. అటు పిల్లలని ఇటు తనని తన గ్రిప్లో వుంచుకోవాలనే తాపత్రయం హెచ్చింది. ఇల్లంతా ఆధునికమయిన పద్ధతిలో అలంకరించుకోవాలనే వుత్సాహం వచ్చింది. మారుమూల పల్లెటూళ్ళల్లో చిన్న చదువులు చదువుకున్నా బస్తీ వాతావరణంలో ఉద్యోగస్తుడయిన భర్తతో, జీవితం ప్రారంభించేసరికి కొత్త కొత్త అభిరుచులన్నీ పుట్టుకు వస్తాయి కాబోల్ను. నిమ్మకు నీరెత్తినట్లుండే పల్లెటూరిలో పుట్టి పెరిగినవారు, బస్తీ కాపురాల్లోకి వస్తే అన్నిటికీ ఆబగా వెంపరలాడుతారు. సత్యవతీ అంతే. కొత్తలో భర్త తనని ఇటూ అటూ త్రిప్పడం లేదని మనస్సులో కించపడేది. క్రమంగా ఇరుగు పొరుగుతో మాటా మంతీ కలిశాక ఈ నగరంలో చూసి నేర్చుకోవాలసినవి చాలావున్నాయి అని తెలుసుకుంది. మాట పలుకుబడి కూడా మార్చేసుకుంది. అన్నిటికీ ఇరుగు పొరుగు వారితో పోటీ పడుతోంది. ఈ మార్పు మంచిదయినా, చూసి నేర్చుకోవటం మంచిదయినా ఆర్థికస్థితి ఆలోచించే స్వభావం కూడా వుండాలి ఆడవాళ్ళల్లో. సత్యవతికి ఆ స్వభావం కూడా వుంది. ఎంతో జాగ్రత్తగా పొదుపుగా చేసుకు వస్తోంది. పైకి నాగరీకంగా డాబుగా వుంటుంది అది శివరాంకూ సంతోషంగానే వుంటోంది. కాని వచ్చిన చిక్కేమిటంటే ప్రతి చిన్న విషయాన్ని చర్చనీయాంశంగా చేస్తుంది. ఆ స్పీచ్ వింటోంటే శివరాంకు తనేదో చాలా చిన్నవాడిననీ అమాయకుడ్ననీ ఏమీ ప్రపంచజ్ఞానం లేనివాడిననీ అన్పించుతుంది. అప్పుడు సత్యవతి తన ఊహా పరిధి దాటి చాలా విస్తృతంగా పెరిగిపోయింది అని భయం వేస్తుంది. వారం పది రోజులుగా సతాయిస్తోంటే తప్పనిసరి అయి మర్నాడు భోజనం చేసేప్పుడు అన్నాడు.

"ఇవ్వాళ వెళతాను. సరేకాని ఎంతయితే ఒప్పుకోమంటావు?"

"ఇద్దరూ ఒకటే క్లాస్ కదా ఇరవయి రూపాయలు యిస్తే చాలుననుకుంటాను."

"మరీ అంత తక్కువా? ఏమన్నా అనుకోరూ?"

"అనుకోవటానికేం. పేటవాళ్ళంతా ఒక పిల్లకి ఇద్దరు పిల్లలకు అని మాట్లాడుకొని నలుగురేసి పిల్లలని పంపుతున్నారు" అంది.

శివరాం సైకిల్ స్టాండువేసి మెట్లు ఎక్కి-

వస్తోంటే లోపల హాలులోంచి చూసింది సులక్షణ. ఆ ఇంటికి చాలా ఎత్తయిన అరుగులున్నాయి. పెంకుటిల్లే అయినా విశాలంగా వుంటుంది. ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుంది. హాలులో అయిదారు పేము కుర్చీల మధ్యన రౌండుగా అల్లిన బల్ల వుంది. శివరాం హాలులోకి వచ్చేడు. ఏమని పిలవాలో తెలియలేదు. తలుపులు తీసే వున్నాయి. కాని హాలులోకి వున్న నాలుగు గుమ్మాలకు మందపాటి కర్టెన్స్ కట్టివుండటంచేత కనుచీకటిగా వున్నట్లు వుంది. తీసి వున్న తలుపును టక టక మనిపించేడు. సులక్షణకు శివరాం వెలుగులోంచి వచ్చేడు కనుక కనిపించేడు. హాలులో నించున్న సులక్షణ అతనికి కనిపించలేదు.

"లోపలికి రావచ్చు" అంటూ పెరటి వైపు వున్న కర్టన్‌ని తొలగించింది. హాలులోకి చిరు వెలుగు వచ్చింది. శివరాం హాలులోకి వచ్చేడు. సులక్షణ భుజాలమీంచి చెంగు ముందుకు తీసుకుంటూ

"కూర్చొండి" అంటూ కుర్చీ చూపించింది.

"మీరూ కూర్చోండి" అంటూ ఆమె ముఖంకేసి చూసి క్షణంలో సగం ఊపిరి అందనట్లు గిజగిజలాడి —

"మీరు....మీరు...." అన్నాడు.

"అవును నేనే! ఏం?" అంది సులక్షణ. ముఖంలో అదే ఠీవి, అదే పొగరు, ధీమా.

"ఇక్కడ ఇలా?"

"అవును. ఏం?" కంఠంలో దర్పం, ముఖంలో మందార రంగు.

"ఎందుకంత కోపం? అసలు జరిగిందేమిటంటే...." అంటూ నీళ్ళు నమిలాడు శివరాం.

"జరిగిన కథ నా కనవసరం. నాకు గతంతో నిమిత్తంలేదు. నువ్వెందుకు యిక్కడికి, నా ఇంటికి వచ్చినట్లు?" అంది సులక్షణ. శివరాం బిక్కచచ్చిపోయేడు.

ఆమెవంక కళ్ళు విప్పుకు చూస్తూ వుండిపోయేడు. సులక్షణకా చూపు చూస్తూంటే పలక బద్దలు కొట్టుకొని మాష్టారుచేత దెబ్బలు తినటానికి సిద్ధమయిన పిల్లవాడు గుర్తుకు వచ్చేడు. మధ్యాహ్న సూర్యుడి తీక్షణత మబ్బుల సాయంకాలం తగ్గించినట్లు అతని అమాయకపు ముఖం, ఆమె కోపం యొక్క ఉద్రిక్తతను చాలమటుకు తగ్గించేసింది. అయినా బింకం సడలకుండా,

"ఏమిటి కథ ఎందుకు వచ్చేవు." అంది మళ్ళీ.

"ఏంలేదు పిల్లలు. పిల్లలు...."

"హుఁ. ఇంకా పిల్లలు కూడా కావలసి వచ్చేరా! నీకు అసలు బుద్ధీ జ్ఞానం వుందా! ద్విపాదపశువి!"

"అదికాదు. అదికాదు. నువ్వు పొరపాటు పడుతున్నావు. నా పిల్లలు ట్యూషన్ చెప్పించుకోవాలంటున్నారు. నువ్వు బాగా చెప్తున్నావు అని అందరూ అంటున్నారు. అంచేత నీ చేత మా పిల్లలకి ట్యూషన్ చెప్పించాలని మా ఆవిడ తాపత్రయ పడుతోంది."

"ఏం చదువుతున్నారు!"

"ఏడవ తరగతి."

"నేనెవరినో వాళ్ళకి తెలియదా?"

"అసలు నువ్వెక్కడున్నావో నాకు తెలిస్తేగా! నీ కథ యింట్లో చెప్పుకుందికి! అసలు ఈ వూరు ఎందుకు వచ్చేవు?"

"అవును! ఈ వూరు ఎందుకు వచ్చేను? వచ్చినా, నా ప్రారబ్ధంకొద్దీ ఈ పేటలోనే ఈ వీధిలోనే యిల్లు దొరకాలా?"

"నేను ఈ వూరు బదిలీ అయి వచ్చి మూడేళ్ళయిపోతోంది. ఇంక రేపో మాపో మేమూ తట్టాబుట్టా సర్దేయవలసి వస్తుంది."

"అయితే నేను భయపడి పారిపోవలసిన అవసరం లేదన్న మాట."

"నీకు భయమా?" అన్నాడు శివరాం.

"అవును. నాకు భయంలేదు. సిగ్గులేదు. బాధలేదు. అవమానంలేదు. నేను మొండిని. జగమొండిని."

"అబ్బబ్బ ఏమిటా దండకం!"

"దండకమా! నువ్విచ్చిన సర్టిఫికేట్సు. దానివల్లే నేనిన్ని రోజులూ, ఏ వూళ్ళోవున్నా ఆ వూళ్ళో మరువలేని మహారాణిలా గడిపేను. నువ్విచ్చిన ఆ సర్టిఫికేట్లే నా కీనాడు





అందగా వున్నాయి."

"అదికాదు. నా మాట వినిపించుకో! నువ్విన్ని రోజులూ ఎక్కడెక్కడ వున్నావు! నీకు వంటరితనం భయమనిపించలేదూ! పది మందిలో పుట్టి పెరిగిన దానివి! నీకు ఏకాకి తనం విసుగనిపించలేమా! పోనీ నాన్నగారికి అమ్మగారికి నీ మీద కోపం అనుకోవచ్చును. అక్కయ్యలున్నారు. నేను వున్నాను. అన్నయ్యలున్నారు. ఎవరికయినా నీ క్షేమం ఒక్కముక్క వ్రాసి పడెయొచ్చుగా!"

"ఎందుకు వ్రాయాలి! ఇంట్లో అందరూ నాకు బద్ధశత్రువులే అయిపోయేరు. నీవు మటుకు ఏం చేసావు! నాన్నగారికి నా మీద కోపం రావాలని వున్నవీ లేనివీ కల్పించి చెప్పావు. 'రమణ'చేత ప్రేమలేఖలు వ్రాయించేవు. నాకు అన్నిట్లోనూ ఫస్టు మార్కులు వస్తున్నాయని జెలసీతో కళ్ళు కుట్టుకున్నావు. కాలేజీకి వెళ్ళితే రమణగాడి ప్రేమగోల. ఇంటికి వస్తే అమ్మా నాన్న ఏదో పరువు ప్రతిష్ఠలు పీకి పందిరేసినట్లు కాకిగోల. వళ్ళు మండింది. మీరు మగ వాళ్ళు అవవచ్చును. ఏం చేస్తున్నారు? డిగ్రీ రాగానే ఎక్కడికో అక్కడికి పొట్ట చేత్తో పట్టుకుని పోతున్నారా లేదా? అల్లాగే నేనూ నా దోవ నేను వెదుక్కుందుకు పోయేను. బి.ఎ. ప్యాసయినప్పట్నించీ చచ్చు పుచ్చు సంబంధాలు వెతకటం మొదలెట్టారు" సులక్షణ ఆగింది.

"నీకు నచ్చకపోతే నచ్చలేదు అని చెప్పవచ్చును. అంతేకాని అజపజా తెలుపకుండా పారిపోవటమేనా!"

"ఎంతమంది మగపిల్లలు పారిపోవడం లేదూ! అలాగే నాకూ చికాకు వేసుకువచ్చింది. వెళ్ళిపోయేను."

"రమణగాడు ఏమయ్యాడు!" అన్నాడు శివరాం.

"ఏమో!"

"మీరిద్దరూ కలిసి వెళ్ళిపోలేదా!"

"మళ్ళీ ఇదొక అభాండమా!"

"మాకు తెలీదు నిజంగా. అభాండంకాదు. రమణగాడు నీ వెంట పడేవాడు కదా! మీరిద్దరూ కలిసే వెళ్ళిపోయేరని అంతా అనుకుంటున్నారు."

"అంటే అంతా నమ్మే సేరన్నమాట! రమణగాడు బి. ఏ. మూడుసార్లు ఫెయిలయినాడు. వాళ్ళ ఆస్తిలో వీడికి వచ్చేది పది పైసలవాటా కూడా వుండదు. బి. ఏ. చదువుకునే వాడికి ప్రేమేమిటి నా బొంద! తల్లిదండ్రులు చక్కగా చదువుకోరా ఒక గుమాస్తా ఉద్యోగమయినా దొరకబుచ్చుకుంటే నిన్ను కట్టుకున్న

దానికయినా గంజినీళ్ళయినా పోస్తావు" అని పిల్లలని చదువుకుందుకు పంపిస్తే ఒకత్తి చలాకీగా వుందనీ, ఇంకొకత్తి బాగా పాడు తుందనీ, ఇంకొకత్తి బాగా చదువుకుంటుందనీ వెంటపడి వెర్రెత్తిపోవటమేనా? వాడు నన్నేమి పోషించగలడని వాడితో వెళ్ళిపోతానను కున్నారు? అంతకన్నా దద్దమ్మలని నాలుగు వేలు అయిదువేలు కట్నాలు ఇస్తామనీ నన్ను పరీక్షించుకోమని అమ్మనాన్నలు కాళ్ళా వెళ్ళా పడేవారు కదా?"

"ఏమో నువ్వెళ్ళిపోయినప్పటినించీ రమణ గాడు మళ్ళీ మన వూళ్ళో కనబడలేదు. అంచేత...."

"ఇద్దరం కలిసి వెళ్ళిపోయేము అను కున్నారా? భలేవారే!" అంది సులక్షణ. శివరాం ఏదో అడుగుదామనుకుని అడగలేకపోతున్నాడు. అతని సందేహం సులక్షణ గమనించింది. గడుసుగా నవ్వింది.

"కాఫీ కలుపుకుని వస్తానుండు. ఇంతకీ నీ పిల్లలకి నేను ప్రయివేట్ చెప్పితే నాలాగే తయారయిపోతాడేమో, దేరా మేకుల్లాగ!"

"ఛ ఛ! ఈ వాడలో అందరూ నిన్ను తెగ పొగడుతున్నారుట! మీ వదిన రోజూ కకపోరగ కతపోరగా ఇవ్వాళ నిన్ను కనుక్కుందామని వచ్చేను. ఇంతకీ ఇన్నాళ్ళూ నీవు మన కుటుం బంతో సంబంధం లేకుండానే వుండిపోయేవు. ఇకనయినా మనవాళ్ళతో రాకపోకలు జరుప కూడదా!" అన్నాడు ఆర్ద్రతగా. సులక్షణ కాఫీ కలిపి తెచ్చింది!

"ఇంటితో సంబంధం నా కెందుకు! మీ అందరి దృష్టిలో నేను లేచిపోయిన మనిషి నాయె. మరీ పెళ్ళి చూపుల మిషతో అడ్డమైన గాడిదలు వేసే కుంటిగుర్రం ప్రశ్నకు జవాబులు చెబుతూ ఎప్పుడు పెళ్ళి అయి ఒక నాథుడి అండ దొరకబుచ్చుకుంటానా అనే ఆశతో పాతికేళ్ళు ముప్ఫయ్ ఏళ్ళు అమ్మానాన్న చాటున ఆకుమాటున పిందెల్లె కాగిపోతూ పుడుకుపిందల్లె రాలిపోవటం కంటె నాదయిన ఒక జీవితం జీవింపగలనా లేదా అనిపించింది. వీధిలోకి వెళితే అర్భకాకారపు రమణగాడి ప్రేమగొడవ. ఇంట్లో ఎప్పటికీ తెమలని పెళ్ళి సంబంధాల వేటల డప్పుల మోత! ఏమి జీవితం అందులో థ్రిల్ ఏమీలేదు! అన్పిం చింది. మీ రిచ్చిన మొండి ధైర్యంతోనే నేను సుఖంగా బ్రతుకుతున్నాను. మళ్ళీ చుట్టాలు, బంధువులు, రాకలు పోకలు నా కెందుకూ!" అంది సులక్షణ.

"అమ్మానాన్నలకి నువ్విలా వున్నావని ప్రాయొద్దా! వాళ్ళు నీ వెక్కడో రమణిన్ని పెళ్ళి చేసుకుని సుఖంగా సంసారం చేసుకుంటున్నా వని అనుకుంటున్నారు. మన కులాలు ఏకం కాకపోయినా ఇంక ఇప్పుడు పదిహేనేళ్ళ తర్వాత వాళ్ళకు పట్టింపులు ఏమీ వుండవు."

"వాళ్ళకి వున్నా లేకపోయినా నాకు వుండవా! మళ్ళీ నన్ను ఒక యింటిదాన్ని చేయాలని ఈ పెద్దకాలంలో ముసలాళ్ళు తాపత్రయ పడు తారు. ఎందుకు అనవసరం గొడవ?"


"అనవసరం గొడవ ఏమిటి! తల్లితండ్రులు పిల్లల బాగుకోసం తాపత్రయ పడటం సర్వ సహజం. ఆవేళ అన్నయ్య రెండో పెళ్ళి సంబంధం చూసాడనే కదా నీకు కోపం వచ్చిందీ! అసలు ఏం జరిగిందంటే...."

"నాకంతా తెలుసు. పెద్దన్నయ్య భార్యకు ఆయన చెప్పాడట. చదువుకున్న అమ్మాయి అయితే చాలును. కట్నం అక్కరలేదని అన్నయ్య ఉబ్బితబ్బిబ్బయిపోతూ చెప్పాడు. మొదటి భార్యను అస్తమానూ అనుమానంతో తిట్టి కొట్టి చంపేవాడుట. ఇప్పుడు చదువు కున్న భార్య కావాలని గెంతులు గెంతుతూంటే చుట్టూ భక్తులంతా చేరి భజన చేస్తున్నారుట. అదేదో నా మెరిట్‌కి వచ్చిన సంబంధం అను కోవాలని అన్నయ్యా వదినా నా చెవిలో ఇల్లు కట్టి చెప్పటం మొదలుపెట్టారు.

బి.ఎ. ప్యాసయి మూడేళ్ళు ఇంట్లో కూర్చు న్నాను. ఏదోలా పెళ్ళిచేసి నా బాధ్యత వది లించుకోవాలనే వాళ్ళ మనస్తత్వం నాకు నచ్చలేదు. మగవాళ్ళకి చదువులు చెప్పించి వున్న ఆస్తులు పంచి ఎల్లా చూస్తున్నారో అల్లానే ఆడపిల్లలకి చదువులు చెప్పించి తాము








సంపాదించినదేదో అన్న తమ్ముళ్ళలతో సమా నంగా ఇచ్చేస్తే ఇంక జ్ఞానం వున్న పిల్లలు ఎవళ్ళకు నచ్చిన భాగస్వాములని వాళ్ళు ఎన్ను కుంటారు. మగపిల్లలకయితే మా వాడికి నచ్చితే మాకు అభ్యంతరం లేదు పెళ్ళికి అంటారు. ఆడపిల్లలకయితే ఆ పిల్లకి నచ్చకపోయినా ఆ పెళ్ళికొడుకు దేవేంద్రుడు, మహేంద్రుడు అంటూ నచ్చచెప్పటం మొదలుపెడతారు. ఇప్పుడు నాకు వచ్చిన లోటేమిటి? మీ లాగే చదువుకున్నాను. ఉద్యోగం దొరకలేదు. ప్రయి వేట్లు చెబుతున్నాను. ఒక వూరు బాగా నలిగి, జనం మధ్యలో నా గురించి ప్రశ్నార్థకాలు మొదలయ్యేసరికి ఉడాయించేస్తాను. మళ్ళీ కొత్తవూరు కొత్త ప్రజలు, కొత్తపిల్లలు. నా భవిష్యత్తుకు సరిపడా డబ్బు పోగుచేసుకున్నాను. మీరు నా కన్న ఎక్కువ సుఖంగా వున్నారా! ఎందుకు నా గురించి మీరంతా లేనిపోనివి వూహించుకుని బాధపడటం! చెల్లెలుకూడా కాని వాడితో లేచిపోయిందనే పుకారుతో, మీరు ఇంటిల్లిపాదీ ఈ పాటికి కుళ్ళి కృశించి పోయివుంటారు. లేచిపోకుండా మళ్ళీ అక్కడ కూడా ఒక మగవాడి అండ లేకుండా వంటరిగా జీవించుతుందంటే ఇంకా మీకు హృదయ విదారకంగా వుంటుంది. రమణగాడు విజయ వాడలో ఒక మోటారు గారేజిలో పని చేస్తు న్నాడు. భగ్నప్రేమకుడిలా కాకుండా వాడికి తగిన వాళ్ళ కులం అమ్మాయిని పెళ్ళి చేసు కున్నాడు. నలుగురు పిల్లలున్నారు. వాళ్ళ అమ్మాయికి ప్రైవేట్ చెప్పాను నేను అక్కడ వుండగా."

"రమణగాడు విజయవాడలో వున్నాడా!" అన్నాడు శివరాం.

"అవును. నేను అక్కడ ఆర్నెల్లు వున్నాను" అంది సులక్షణ.

"మరి నేను వస్తాను. పిల్లల్ని పంపనా!"

"పంపు. మరి వదినగారికేం చెబుతావు!"

"ఫీజు ఇరవయి రూపాయలని. అంతకంటే ఎక్కువ ఇవ్వద్దన్నది మీ వదిన."

"గట్టిదే! ఫీజుమాట కాదు. మరి నే నెవ రని అడిగితే ఏమని చెబుతావు?"

"అడగదు."

"ఎందుకని."

"నాకు చెల్లెలున్నదని ఆమెకు తెలియదు. ఇంట్లో కూడా యెవ్వరూ నీ ప్రసక్తి యింత వరకూ తేలేదు."

"మంచిదే అయితే. రమణగాడి ధర్మమా అని పాపం మీ వాళ్ళందరి పరువు ప్రతిష్ఠలు అటక ఎక్కించేసాడన్న మాట. పోనీలే! అదీ ఒకందుకు మంచిదే."

"ఇప్పటికన్నా నిజం తెలిసిందిగా! సులక్షణా! మా యింటికి వచ్చెయ్యి. వదినతో అంతా చెబుతాను. అందరం కలిసే వుందాము."

"ఇదేమన్నా సినిమా కథా శివా! మా చెల్లెలు దొరికింది అంటే వదినలందరూ హారతులు పట్టటానికి? ఎప్పుడు వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది? ఎలా వెళ్ళింది? ఎవళ్ళతో వెళ్ళింది? ఇప్పుడెవరితో వుంటోంది? అంటూ సవాలక్ష ప్రశ్నలతో వాళ్ళ బుర్రలు వేడెక్కిపోతాయి. ఇంట్లో ఆడవాళ్ళ బుర్రలు వేడెక్కినాయంటే ఇంక ఆ ఇంటి వాతావరణం భోగిమంటవద్ద కూర్చున్నట్టే వుంటుంది. ఎందుకివంతా? నా బ్రతుకు నేను బ్రతుకుతున్నానుకదా! ఏమీ గాభరా పడకు" అంది సులక్షణ.

"నువ్వేమీ మారలేదే బాబూ!" అన్నాడు శివరాం.

"ఎందుకు మారాలి?" ఎదురు ప్రశ్న వేసింది.

"మా అందరి కొసం" అన్నాడు.

"ఒక్కదాని కోసం మీరంతా కించిత్తూ పట్టుదలలు సడలించుకోలేదు. మీ అందరి కోసం నేను ఒకత్తినీ నా వ్యక్తిత్వానికి సీళ్లొదులుకోవాలా? లాభం లేదురా శివా! లాభం లేదు" అంది.

"పోనీలే" అంటూ వెళ్ళిపోయేడు శివరాం.

చెల్లెలు బాగా చదువుకుందని అందుకని తలబిరుసుని అనుకుని తను చదువుకోని అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. సత్యవతి మెల్లి మెల్లిగా చాపక్రింద నీరులాగ తననాక్రమించుకుని తనదే పైచేయి అన్పించుకుంటోంది. ఎలాగయినా ఈ రోజుల్లో ఆడవాళ్ళు చాలా మారారు. అమ్మా వదినల కాలంలోలా కాదు అనుకుంటూ నిట్టూర్చాడు శివరాం.

"రేపట్నించీ పంపమంది పిల్లల్ని." అన్నాడు ఇంటికి వచ్చి.

"మరీ రెండు గంటలు కూర్చుండిపోయేరేమిటండీ అక్కడ? మీకు తెలుసున్నావిడా?" అంది సత్యవతి.

గతుక్కుమన్నాడు శివరాం. తను వాళ్ళింటికి వెళ్ళి ఎంతసేపున్నాడో నోటు చెసిందన్న మాట! ఏమి ఆడవాళ్ళు?

"అవును. ఆవిడ మా స్నేహితుడి చెల్లెలేనూ" అన్నాడు.

"పాపం ఒంటరిదిటా! పెళ్ళి పేరంటం కాలేదా? మొగుడొదిలేశాడా?" అంది.

"నేనేమీ అడగలేదు. లోకాభిరామాయణం మాట్లాడుకున్నాం అంతే!" అంటూ మళ్ళీ బయటికి వెళ్ళిపోయేడు.

ఆమె వచ్చి నిండా ఒక నెల కాలేదు. అప్పుడే సులక్షణ గురించి ప్రశ్నార్థకాలు మొదలయ్యాయి. ఏమయినా సులక్షణని వంటరిగా వదలకూడదు. దూరంనించయినా గమనించుతూ వుండాలి. అదే నిర్ణయం తీసుకున్నాడు శివరాం. □

వచ్చేనెల నవలానుబంధంలో

వి. రాజా రామమోహనరావు నవల

'పోటీలేని పరుగు'

చదవండి



## 'వంశీ - బర్కిలీ' పోటీలో

## బహుమతులు పొందిన కవితలు

### తెల్లమబ్బు

నిర్మలాకాశంలో
ఓ తెల్లని మబ్బుతునక
నిశ్చలంగా సాగిపోతున్న దృశ్యం
నా కళ్ళకెంతో అందంగా
ఇంకెంతో మనోహరంగా వుంది
రాగ, ద్వేషాల కతీతంగా
ఘోర పాపాలకు సుదూరంగా
సాగిపోతున్నదనే దివ్యానుభూతి
నా నరనరాల్లోంచి ప్రాకుతోంది
మంచికి రూపంలా
మమతకు దీపంలా వున్న
ఆ మబ్బును చూచి
నేను నేర్చుకోవాల్సిందెంతో వుందనిపించింది
అందుకే ఒక్కసారి
నా మనసు అద్దంలోకి
తొంగి చూశాను—
అద్దం నిండా ఒకటే మరకలు
అవి నేను చేసిన తప్పులకు కాబోలు ప్రతిరూపాలు
నిశ్చయించుకున్నాను—
మనసుకు పట్టిన మరకలు తొలగించుకోవాలని
నీలి అంచుపై తేలే మబ్బులా సాగాలని
అందుకే పవిత్ర జలముకై వెదుకుతున్నాను
ఆ నిరీక్షణలో—
నా కళ్ళల్లో నిలిచిన నీళ్ళు
నాలో వెలిగించాయి కోటి శాంతి దివ్వెలు

—కుమారి కాద సరోజారాణి

### ఆవేదన

నందనంలా మురిపిస్తుందనుకున్న జీవితం
నరకంలా మారిపోతున్నప్పుడు,
ఆకాశమంతటి అంతరంగం
అంతకంతకూ సంకుచితమవుతున్నప్పుడు,
మమతల మల్లెలు విరియవలసినచోట
మాత్సర్యాలు కళ్ళు తెరుస్తున్నడు,
    పున్నమిలా నవ్వలేను
    పువ్వులు వెదజల్లలేను.
అంతరంగంలో ఎగిసిపడే కోరికలు
కడలి కెరటాల్లా కరిగిపోతున్నప్పుడు,
పరిమళిస్తుందనుకున్న జీవనసుమం
మొగ్గలోనే త్రుంచి వేయబడినప్పుడు,
అందలం ఎక్కిస్తుందనుకున్న భవిష్యత్తు
అగాథంలోకి త్రోసివేసినప్పుడు
    వేకువను కనలేను
    చీకటిలో మనలేను.
మోసాల అందమైన ఉచ్చుల్లో
మంచితనం చిక్కుపడిపోతున్నప్పుడు,
సమ్మెలూ సత్యాగ్రహాలతో నిండిన రాజకీయం
సామాన్యునికి శాపంలా పరిణమించినప్పుడు
వెలుగుపుంతకావలసిన విద్యార్థిలోకం
అతుకుల బొంతగా చితికిపోతున్నప్పుడు,
    ఆశయాలు పండించలేను
    ఆశీస్సులందించలేను.
నిశ్చింతగా విహరించే న్యాయము, స్వేచ్ఛ
గువ్వల్లా గూటిలోనే ఒదిగిపోతున్నప్పుడు,
అమృతం ఆశించిన చోట
హాలాహలం ఆవిర్భవిస్తున్నప్పుడు,
కవులనేవారి కవిత్వాలలో
కదిలించే శక్తి కరువైనప్పుడు
    మనిషినని ఒప్పుకోలేను
    కాదని తప్పుకోలేను.

కోటం రాజు (చిల్లర) భవానీదేవి